ప్రపంచ ఒలింపిక్ డే వేడుకలు

ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న మాజీ విప్ నల్లాల ఓదెలు

మందమర్రి, జూన్ 23 : ప్రపంచ ఒలింపిక్ డే వేడుకలను మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల వాకర్స్ అసోసియేషన్, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఒలింపిక్ డే రన్‌ను చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ నల్లాల ఓదెలు ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో ప్రారంభమైన రన్.. మార్కెట్, కార్మిక కాలనీల మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రామ్ వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కోశాధికారి కనపర్తి రమేశ్, ఐఎన్టీయూసీ నాయకుడు కాంపెల్లి సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు గుడ్ల రమేశ్, హ్యాండ్‌బాల్ కోచ్ అరవింద్, రాజలింగు, సంతోశ్, కళ్యాణ్‌గౌరీ, విశాల, స్మృతిసాయి వర్షా తదితరులు పాల్గొన్నారు.

'తవక్కల్'లో మరో ఇద్దరికి 10 జీపీఏ

తల్లిదండ్రులను సన్మానిస్తున్న చైర్మన్ అబ్దుల్ అజీజ్

గడ్డం హాసిని

రామకృష్ణాపూర్, జూన్ 23 : పదోతరగతి రీ వెరిఫికేషన్ ఫలితాల్లో రామకృష్ణాపూర్‌లోని తవక్కల్ ఉన్నత పాఠశాలలోని మరో ఇద్దరు విద్యార్థులకు 10 జీపీఏ వచ్చినట్లు విద్యాసంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. ఆదివారం పాఠశాల ఆవరణ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్‌లో విడుదలైన ఫలితాల్లో ఒక విద్యార్థికి 10 జీపీఏ వచ్చిందన్నారు. మరికొందరికి రావాల్సి ఉండడంతో పాఠశాల యాజమాన్యం రీ వెరిఫికేషన్ కోసం ఫీజు చెల్లించిందని తెలిపారు. దీంతో గడ్డం హాసిని, పుల్లూరి సాత్విక్‌కు 10 జీపీఏ వచ్చిందని పేర్కొన్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో ఈ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారని తెలిపారు.

మున్నారుకాపు సంఘం కార్యవర్గం

జన్నారం, జూన్ 23 : మండల కేంద్రంలో పొనకల్ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని మండలాధ్యక్షుడు కాశెట్టి లక్ష్మణ్ సమక్షంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లెక్కల మల్లయ్య, గౌరవాధ్యక్షుడిగా కస్తూరి భూమన్న, ఉపాధ్యక్షులుగా బొడ్డు రామన్న, ఏ శ్రీనివాస్, బీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అప్పల జలపతి, కార్యవర్గ సభ్యులుగా ఉదయ్, డీ శ్రీనివాస్, ఈ సత్తయ్య, ప్రచారకార్యదర్శిగా దాసరి రాజన్న, కోశాధికారిగా పూదరి నర్సయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులుగా తిరుపతి, మల్లేశ్, పీ నాగన్న, కే రాజన్న, సహ కార్యదర్శులుగా రాజేందర్, నర్సయ్య, చంద్రమోహన్, కార్యవర్గసభ్యులుగా నలుగురు, ముఖ్యసలహాదారులుగా ఆరుగురినని నియమించినట్లు తెలిపారు.

ప్రధాన రహదారిపై దిగబడ్డ లారీ

- భారీగా ట్రాఫిక్ జామ్.. గంటపాటు నిలిచిన వాహనాలు

వెంకట్రావ్‌పేట్ సమీపంలో దిగబడ్డ లారీ

సిర్పూర్(టీ), జూన్ 23 : సిర్పూర్(టీ)–కౌటల ప్రధాన రహదారి వెంకట్రావ్‌పేట్ సమీపంలోని ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం ఓ భారీ లారీ గుంతలో దిగబడిపోయింది. దీంతో దాదాపు రెండు గంటల పాటు భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది సుమారు కిలో మీటర్ మేర వాహనాలు ఎక్కడికక్కడా నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న సిర్పూర్(టీ) ఎస్ఐ దిగబడ్డ లారీని బయటకు తీయించారు. కౌటల, బెజ్జూర్ మండలాలతో పాటు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి నిత్యం వాహనాలు ఈ రహదారి గుండా ప్రయాణాలు సాగిస్తుంటాయి. దీంతో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారులు ధ్వంసమవుతున్నాయని ప్రయాణికులు అంటున్నారు. ఈ రోడ్డు మార్గాన మూడు నెలల్లో మూడుసార్లు లారీలు గుంతల్లో దిగబడి, అటంకం కలిగించాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, భారీ వాహనాలను ఈ రోడ్డు మార్గాన రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ కార్యవర్గం

జన్నారం, జూన్ 23 : మండల కేంద్రంలోని ఫారెస్ట్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జోనల్ కార్యదర్శి సుభాష్, సర్కిల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అజార్ సమక్షంలో జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేషురాం(దొంగపెల్లి), ఉపాధ్యక్షులుగా లాల్‌బాయ్(మహ్మదాబాద్), ప్రధానకార్యదర్శిగా ముజీబొద్దీన్(కలమడుగు), ఆర్గనైజర్‌గా కృష్ణరావు(కవ్వాల్), జాయింట్ సెక్రటరీగా కృష్ణమూర్తి(మల్యాల్), కోశాధికారిగా అనిల్(దండేపెల్లి) ఎన్నికైనట్లు వారు తెలిపారు. నూతనంగా ఎన్నికైన జూనియర్ పారెస్ట్ అసోసియేషన్ కమిటీని డివిజన్ పారెస్ట్ అధికారులు అభినందించారు.

వరద ప్రభావిత ప్రాంతాల సందర్శన

శ్రీరాంపూర్, జూన్ 23 : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వరద ప్రభావిత ప్రాంతాలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ సందర్శించారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధి 18వ వార్డు అల్లూరి సీతారామరాజునగర్, 21వ వార్డు జాన్సీనగర్, 10వ వార్డు విన్నూత్న కాలనీలో సురేఖ సందర్శించి, ప్రజలను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిల్ల వేణు, కౌన్సిలర్లు కోదూరి లహరి, చీడం మహేశ్, నాయకులు గాండ్ల అంజయ్య, మహేశ్ ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రెబ్బెన, జూన్ 23 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 3 రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ సూచన మేరకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెబ్బెన ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యంగా నదీ తీర ప్రాంతాలు, పాత ఇండ్లలో ఉండేవారు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇబ్బందులు ఉంటే పోలీసులకు గానీ, డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు

రెబ్బెన, జూన్ 23 : ప్రభుత్వం నిషేదించిన గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జరుగుతుందని రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. రెబ్బెన మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాల్లో ఆదివారం తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ దుకాణంలో రూ.5,200 విలువ గల గుట్కాలు, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు సదరు దుకాణాదారుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నిధులు మళ్లించి.. నిర్మాణం ఆపేసి

- కాంగ్రెస్ సర్కారు నిర్వాకం
- ఆవిరైన చిరువ్యాపారుల ఆనందం
- ఆగిపోయిన మందమర్రి సమీకృత మార్కెట్ భవన నిర్మాణం
- రూ.7.2 కోట్లతో ప్రారంభించిన కేసీఆర్ ప్రభుత్వం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో.. మందమర్రి పట్టణంలో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల వరకు పనులు వేగంగానే సాగినా.., ప్రస్తుత ప్రభుత్వం నిధులను మళ్లించి, పనులు ఆపివేయాలని ఆదేశాలందాయి. పట్టణ నడిబొడ్డున నిర్మాణం పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని, ఇక మంచి రోజులు వస్తాయని సంతోషపడ్డ వ్యాపారుల ఆశలు అడియాశలయ్యాయి. ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, పనులు కొనసాగిస్తారా.., లేక శాశ్వతంగా నిలిపి వేస్తారా.. అనే ప్రశ్నలు మాత్రమే మిగిలాయి. ఏదేమైనా ప్రభుత్వం మారినంత మాత్రాన ఇలా పనులు నిలిపివేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. - మందమర్రి, జూన్ 23

మందమర్రి పట్టణంలో మార్కెట్ సౌకర్యం.., దుకాణ సముదాయాలు లేక దశాబ్దాలుగా కూరగాయలు, పండ్లు, నాన్‌వెజ్ విక్రయాలు జరిపే చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ కాలం వెల్లదీస్తున్నారు. అయినా ఎవరూ వారి కష్టాలను గుర్తించిన, పట్టించుకున్న పాపాన పోలేదు. రోడ్ల పక్కన వ్యాపారాలు సాగించే పరిస్థితి. సరైన పార్కింగ్ సౌకర్యం లేక ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతూ కొనుగోళ్లు చేసేవారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత స్వపరిపాలనలో చిరు వ్యాపారుల కష్టాలను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం.. సమీకృత మార్కెట్ సముదాయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మందమర్రి మున్సిపాలిటీలోని చిరు వ్యాపారులు తమ సమస్యను అప్పటి ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని మంజూరు చేయించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్షియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ) కింద రూ.7.20 కోట్లు కేటాయించారు. పట్టణంలోని రామన్ కాలనీ సమీపంలో సమీకృత మార్కెట్ భవన నిర్మాణానికి మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. పట్టణ నడిబొడ్డున నిర్మాణం పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని, మంచి రోజులు వస్తున్నాయని చిరు వ్యాపారులు సంతోషపడ్డారు. ఎన్నికల వరకు వేగంగానే కొనసాగిన పనులు.. ఎన్నికల సందర్భంగా నిలిపివేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా, పనులు ప్రారంభానికి నోచుకోవడంలేదు. దీంతో చిరు వ్యాపారులు నిరాశకు లోనవుతున్నారు.

మందమర్రిలో అసంపూర్తిగా ఉన్న సమీకృత మార్కెట్ భవనం

దుకాణాలు కోల్పయిన వ్యాపారులు..

స్థానిక పాత బస్టాండ్, యాపల్ ఏరియాల్లో నాలుగు వరుసల రహదారి నిర్మాణంతో రోడ్డు పక్కన గల దుకాణాలను చిరు వ్యాపారులు కోల్పోయారు. సమీకృత భవన నిర్మాణంతో తమ కష్టాలు తీరుతాయనుకుంటే.. మారిన ప్రభుత్వం పనులను పట్టించుకున్నట్లు కనిపించడం లేదని వాపోతున్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పనులు కొనసాగిస్తారా.. లేక శాశ్వతంగా నిలిపి వేస్తారా.. అని ఆందోళన చెందుతున్నారు. కాగా, పనులను కొనసాగించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సమీకృత మార్కెట్ భవనం పూర్తయితే పట్టణంలోని పాత బస్టాండ్, యాపల్, రామన్ కాలనీ, విద్యానగర్, మారుతీనగర్ తదితర కాలనీల ప్రజలతో పాటు, మార్కెట్ ఏరియాలోని కాలనీల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

నిధులు మళ్లించిన ప్రభుత్వం..

కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను నిలిపివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పనులు నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు, టీయూఎఫ్ఐడీసీ నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు పేర్కొంటున్నారు. తిరిగి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తప్ప ఏమీ చేయలేమని తేల్చిచెప్తున్నారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను నిలిపి వేసినట్లు వెల్లడించారు.

❖ కష్టాలు తీరుతయనుకున్నం..

కేసీఆర్ హయాంలో చేపట్టిన మార్కెట్ నిర్మాణంతో మా కష్టాలు తీరుతాయనుకున్నం. సకల సౌకర్యాలతో నిర్మిస్తున్నారని సంతోషపడ్డాం. అందులోనే పండ్లు, కూరగాయలు, నాన్ వెజ్ ఇతర వస్తువుల విక్రయాలకు వేర్వేరుగా గదులు నిర్మిస్తున్నట్లు చెప్పడంతో రోడ్డు పక్కన దుమ్మూధూళితో పాటు వాహనాల కాలుష్యం మధ్యలో వ్యాపారం చేస్తున్న మాకు ఉపశమనం కలుగుతుందని ఆశపడ్డాం. కానీ, అసెంబ్లీ ఎన్నికల నుంచి పనులు నిలిపేసిన్రు. కాంగ్రెస్ సర్కారు పనులు పూర్తిచేసే పరిస్థితి కనిపించడం లేదు. సర్కారు మారడంతో మళ్లీ మా కష్టాలు మాకే మిగిలాయి. తాత్కాలిక షెడ్లు సక్రమంగా లేక వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ నానా కష్టాలు పడుతున్నాం.

- శ్రీకాంత్, చిరు వ్యాపారి, మందమర్రి

❖ అష్టకష్టాలు పడుతున్నం..

సరైన సౌకర్యం లేక రోడ్ల పక్కన కూరగాయలు అమ్ముతూ అష్టకష్టాలు పడుతున్నాం. గత ప్రభుత్వం మా లాంటోళ్లకోసం మంచి ఆలోచన చేసింది. రామన్ కాలనీ దగ్గర పెద్ద భవనం కడుతున్నరని తెలిసి, ఎండ, వానల నుంచి కష్టాలు తీరుతయని సంబురపడ్డం. కానీ ఆ సంబురం ఎన్నో రోజులు నిలువలేదు. ఎన్నికలప్పుడు పనులు నిలిపేసిన్రు. తర్వాత మొదలుపెడుతరనుకున్నం. మొత్తానికే ఆపుతరనకోలే. అన్ని రకాల సరుకులు ఒక్కకాడనే దొర్కుతే గిరాకీ పెరుగుతుందనుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు గడచినా పనులు మొదలువెట్టలే. ఇగ మా కష్టాలు తప్పేటట్లు లేవు.

- మారం రాజమ్మ, కూరగాయల వ్యాపారి, మందమర్రి

దండేపల్లి : ఆనాటి గురువులతో 2003–04 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు

చెన్నూర్ టౌన్ : 1998–2000 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనాలు

ఎన్నో ఏండ్ల తర్వాత అ'పూర్వ' కలయికలు. ఈ సందర్భంగా ఆత్మీయ, అనురాగ పలకరింపులు. ఒకరికొకరి యోగక్షేమాలు తెలుసుకుంటూ.. ఉబ్బితబ్బిబ్బైన మనసులు. ఆనాటి జ్ఞాపకాలు.., తీపి గుర్తులను నెమరువేసుకుంటూ రాల్చిన ఆనందబాష్పాలు. రోజంతా ఉత్సాహభరితంగా గడిపిన క్షణాలు. ఇవీ.. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఆయా విద్యాలయాల్లో ఏర్పాటు చేసిన అ'పూర్వ' సమ్మేళన కార్యక్రమాల్లో ఆనాటి విద్యార్థులు అనుభవించిన ఆనందకర దృశ్యాలు. - బెల్లంపల్లి/దండేపల్లి/మందమర్రి/చెన్నూర్ టౌన్/వాంకిడి, జూన్ 23

బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల 1996–97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు.. 28 ఏండ్ల తర్వాత ఒక్కచోట చేరారు. ఆ నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బ్యాచ్‌లో మృతి చెందిన విద్యార్థులకు 2 నిమిషాలు మౌనం పాటించి, నివాళులర్పించారు. అలాగే దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 2003–04 విద్యార్థులు.. 21 ఏండ్ల తర్వాత కలుసుకున్నారు. అందుబాటులో ఉన్నవారందరూ కుటుంబ సభ్యులతో వేడుకలకు హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. మందమర్రి పట్టణంలోని మేదరిబస్తీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1986–87 ఏడో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు 37 ఏండ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. ఐదు పదుల వయస్సు దాటినా చిన్న పిల్లల్లాగానే ఆడిపాడారు. తమకు విద్యనందించిన గురువులను ఆహ్వానించి, సన్మానించారు. పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు సతీశ్, పూర్వ ఉపాధ్యాయులు సూర్యనారాయణ, మహేందర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు లక్ష్మీనారాయణ, సామల అశోక్, గట్టు శ్రీనివాస్, మీసాల అప్పారావు, పంజాల ఈశ్వర్, దేవేంద్ర, వెంకటలక్ష్మి, ఉమాదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు. చెన్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 1998–2000 బ్యాచ్ విద్యార్థులు 25 ఏండ్ల తర్వాత స్థానిక ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఒక్కచోట చేరారు. అధ్యాపకుల ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. సమాజసేవలో పాల్గొనాలని పూర్వ విద్యార్థులకు లెక్చరర్ బాల్ రెడ్డి సూచించారు. వాంకిడి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల 1994–95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అ'పూర్వ' సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.



మందమర్రి : అప్పటి గురువులతో 1986–87 బ్యాచ్ విద్యార్థులు



వాంకిడి : 1994–95 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

'అట్రాసిటీ పేరిట బెదిరింపులు సరికాదు'

కాగజ్‌నగర్, జూన్ 23 : బాదితుడు శ్రీనివాస్‌ను అట్రాసిటీ కేసు పేరిట బెదిరించడం సరికాదని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేటు దవాఖాన తనదంటే తనదని కొద్ది రోజులుగా వివాదం జరుగుతున్నది. ఈ విషయమై పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ కొలిక్కి రాకపోవడంతో ఈ వివాదం పోలీసు స్టేషన్ వరకు వెళ్లింది. ఈ విషయమై కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఎంహెచ్‌డీ రాష్ట్ర నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బాదితుడు శ్రీనివాస్‌కు అన్యాయం జరుగుతున్నదని, అధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక దళిత మహిళా వైద్యురాలు ఇలా అన్యాయంగా ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. బాధితుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన వద్ద ఉద్యోగరీత్యా చేరిన మహిళా వైద్యురాలు తనను మోసం చేసి, దవాఖా తనదేనంటూ తిరుగుబాటు చేస్తున్నదని ఆరోపించారు. తన వద్ద ఉన్న ఆధారాలతో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌డీ రాష్ట్ర నాయకులు నగేశ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'కృషి పట్టుదలతో ఏదైనా సాధ్యమే'

మందమర్రి, జూన్ 23 : కృషి, పట్టుదల ఉంటే విజయాలు సాధించడం, నిర్ణయించుకున్న గమ్యాన్ని చేరుకోవడం సులభమేనని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, నాయకులు క్రీడాకారులకు సూచించారు. ప్రపంచ హ్యాండ్ అసోసియేషన్ దినోత్సవ వేడుకలను మందమర్రి పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, నాయకులు, అసోసియేషన్ సభ్యులు ప్రధాన కార్యదర్శి రమేశ్‌తో పాటు క్రీడాకారులను సన్మానించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌రావు, రమేశ్, ఐఎన్టీయూసీ నాయకుడు కాంపెల్లి సమ్మయ్య, కాంగ్రెస్ నాయకుడు దుర్గం నరేశ్, అసోసియేషన్ కోశాధికారి అలుగుబెల్లి రమేశ్, నాయకులు గుడ్ల రమేశ్, కోచ్ సునార్కర్ రాంబాబు, అరవింద్, రాజలింగు, రాధా, రాణి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సేంద్రియ ఎరువుల విక్రయం

కౌటాల, జూన్ 23 : కౌటాల ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో తయారు చేసిన సేంద్రియ ఎరువులను విక్రయించనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ నస్రుల్లా ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ త్రిపాఠితో పాటు ఇతర జిల్లా అధికారులు రానున్నట్లు పేర్కొనానరు. మండలంలోని రైతులు సేంద్రియ ఎరువులు కొనుగోలు చేసేందుకు విక్రయ కేంద్రానికి రావాలని ఆయన సూచించారు..

26న మండల సర్వసభ్య సమావేశం

బెల్లంపల్లి, జూన్ 23 : బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్‌లో ఈ నెల 26న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు ఉదయం 11 గంటలకు పూర్తి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. సమయపాలన పాటించాలని ఆయన కోరారు.

కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్‌కు నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కౌటాల/చింతలమానేపల్లి, జూన్ 23 : సిర్పూర్ మండలంలోనవెల్లి సబ్‌స్టేషన్, కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాలకు సోవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని కౌటాల సబ్ డివిజన్ ఏడీఈ రాజేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోనవెల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి కౌటాల 33/11 కేవీ సబ్ స్టేషన్ వరకు 33 కేవీ లైన్ మరమ్మతులు, మెయింటనెన్స్ పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

28న కూరగాయల సంత వేలం

బెల్లంపల్లి, జూన్ 23 : పట్టణంలోని కూరగాయల సంత (తైబజార్)కు 28న బహిరంగ వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక తెలిపారు. వేలంలో పాల్గొనే వారు మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి

దహెగాం, జూన్ 23 : దహెగాం మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ మండలాధ్యక్షుడు పాపర్తి ధనుంజయ్ ఆధ్వర్యంలో జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట చంద్, పడాల సురేశ్, దబిట్ట సత్యనారాయణ, పుప్పాల లక్ష్మీనారాయణ, ఇస్లావత్ విజయ్, రాపర్తి ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

ఊరు పోచమ్మ కొలుపు

చెన్నూర్ రూరల్, జూన్ 23 : మండలంలోని ఎర్రగుంటపల్లి, నాగాపూర్ గ్రామాల్లో ప్రారంభించిన ఊరు పోచమ్మ కొలుపు ఆదివారంతో ముగిసింది. శనివారం ప్రారంభించగా, ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగిందని గ్రామస్తులు తెలిపారు. కొమ్మెర, రచ్చపల్లి, ముత్తరావుపల్లి, పొక్కూర్, బీరెల్లి గ్రామాలకు రాకపోకలను యథావిధిగా కొనసాగించారు. గ్రామ దేవతలను డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగించారు. ఉరు పోచమ్మకు మేక పోతులను బలి ఇచ్చారు. పంబాల వారు పట్నాలు వేసి, మొక్కులు చెల్లించారు. మాజీ సర్పంచులు అన్నల తిరుపతి, బండారి సత్యనారాయణ, మడక స్వప్న పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నస్పూర్, జూన్ 23 : జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పీఆర్టీయూటీఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ.. 20 ఏండ్ల నుంచి పరిష్కారం కానీ పండిట్ పీఈటీ పోస్టుల అప్‌గ్రెడేషన్ ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసి, ప్రమోషన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గంగాధర్, భారతి, రవికాంత్, సుధీర్, రామకృష్ణ, శ్రీనివాస్, సాంబయ్య, సంపత్, అచ్చన్న, బుచ్చన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ

చింతలమానేపల్లి, జూన్ 23 : చింతలమానేపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంటెంకి దేవాజి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని డబ్బా గ్రామంలో ఆదివారం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ 37 ఏండ్లు ఉపాధ్యాయుడిగా చదువతో పాటు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులను ఉత్తేజపరుస్తూ ఉన్నత స్థానాల్లో ఉంచేందుకు కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

28న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

మంచిర్యాల అర్బన్, జూన్ 23 : జాతీయ ఆరోగ్య మిషన్ కింద చెన్నూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గైనకాలజిస్టు పోస్టు భర్తీకి (జీతం రూ.1.30లక్షలు) డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28న కలెక్టరేట్‌లో వాక్ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో అనిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు అర్హులు హాజరవ్వాలని పేర్కొన్నారు. ఎంబీబీఎస్ (డీజీవో), ఎండీ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజిస్ట్ అల్ట్రా సౌండ్ (సోనోగ్రాఫర్) అర్హత ఉన్న వారికి ప్రాధన్యత ఇవ్వనున్నట్లు వివరించారు.

నేడు జీలుగా విత్తనాల పంపిణీ

మందమర్రి రూరల్, జూన్ 23 : మందమర్రి మండల పరిధిలోని పలు గ్రామాల రైతులకు సోమవారం పాత బస్టాండ్ ఏరియాలోని పెట్రోల్ పంపు ఎదురుగా గల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ విస్తీరణ అధికారి ముత్యం తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రి మండలానికి ఆదివారం 75 బస్తాల జీలుగు విత్తనాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మంచిర్యాల అర్బన్, జూన్ 23 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్ స్టేషన్‌కు సీఐగా బదిలీపై వచ్చిన సీహెచ్ రాజామౌళి గౌడ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో వీఆర్–2 విభాగంలో విధులు నిర్వహించిన ఆయన, 22న ఇక్కడికి బదిలీ అయాయరు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలియజేశారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

జైపూర్, జూన్ 23 : మండలంలోని ఇందారం శివాలయం చౌరస్తాలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఎస్ఐ శ్రీధర్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ తమ వ్యాపార సముదాయాలు, నివాసాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ ఫయాజ్, దుకాణాదారులు తదితరులు పాల్గొన్నారు.